# వివిధ రంగాలపై బడ్జెట్ ప్రభావం.. క్రిసిల్ విశ్లేషణ

**పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2009-10 బడ్జెట్ వివిధ రంగాలను ఏ విధంగా ప్రభావితం చేస్తుందో క్రిసిల్ (క్రెడిట్ రేటింగ్ అండ్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ ఆఫ్ ఇండియా లిమిటెడ్) విశ్లేషించింది. దీని ప్రకారం కనీస ప్రత్యామ్నాయ పన్నును 10 నుంచి 15 శాతం పెంచడం వల్ల.. వివిధ రంగాల ద్వారా లభించే ఆదాయం ప్రభావితమవుతుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్ లో భారత్ ఉత్పత్తులు పోటీని ఎదుర్కోవడానికి కొన్ని రంగాలకు ప్రోత్సాహకాలు, రాయితీలు అవసరమవుతాయని క్రిసిల్ విశ్లేషించింది.**



## ఆటోమొబైల్ రంగం:

బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయాలు ఆటోమొబైల్ రంగంపై పెద్దగా ప్రభావం చూపే విధంగా లేవు. గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యత, ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి పెంపు వంటి చర్యలు.. ద్విచక్ర వాహనాల డిమాండ్‌ను పెంచడానికి దోహదపడ గలవు. ప్యాసింజర్ కార్లు, ప్రయోజనకర వాహనాలు ముఖ్యంగా 2000 సీసీలపై అదనపు డ్యూటీని రూ.20,000 నుంచి రూ.15,000లకు తగ్గించడం డిమాండ్‌ను అంతగా ప్రభావితం చేయదు. నీటిపారుదల రంగానికి నిధుల పెంపు వల్ల భవిష్యత్తులో ట్రాక్టర్ అమ్మకాలు పెరిగే అవకాశం ఉంది. జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ రెన్యువల్ మిషన్ (జెఎన్ఎన్‌యూఆర్ఎం)కు నిధుల కేటాయింపు పెరగడం వల్ల బస్ అమ్మకాలు పెరగవచ్చు.

## బ్యాంకింగ్, ఫైనాన్స్:

బడ్జెట్ ప్రాధాన్యతా రంగాల పరపతికి ప్రాధాన్యతనిచ్చింది. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు 40 బిలియన్ రూపాయలు, గ్రామీణ హౌసింగ్‌కు 20 బిలియన్ రూపాయల పరపతి రిఫైనాన్సింగ్ ప్రకటించారు. 2009-10 ఆర్థిక సంవత్సరంలో క్షేత్ర రంగానికి రూ. 3250 బిలియన్ల పరపతి లభిస్తుంది. 2008-09 సంవత్సరంలో వ్యవసాయ రంగ వృద్ధిలో తగ్గుదల కారణంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఆరంగానికి పరపతి పెంచారు.

## విమానాశ్రయాల్లో మౌలిక సౌకర్యాలు:

విమానయాన రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడానికి పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టిన ప్రాజెక్టులకు వాణిజ్య బ్యాంకులు మంజూరు చేసిన పరపతిలో 60 శాతం ఇండియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ లిమిటెడ్ రీఫైనాన్సింగ్ చేస్తుంది. ట్రిలియన్ రూపాయల వరకు ఈ సౌకర్యం లభిస్తుంది. ఫిబ్రవరి 2009లో ప్రకటించిన మధ్యంతర బడ్జెట్‌లోనూ ఈ విషయం వెల్లడించారు. కనీస ప్రత్యామ్నాయ పన్ను (ఎంఏటీ) 10 నుంచి 15శాతం పెంపుదల ఈ రంగంపై పెద్ద ప్రభావాన్ని చూపించదు.

## సిమెంట్:

సిమెంట్‌పై విధించే ఎక్సైజ్, కస్టమ్స్ డ్యూటీల్లో ఎటువంటి మార్పు లేనందువల్ల.. సిమెంట్ ధరల్లో పెద్దగా మార్పు ఉండక పోవచ్చు. ఈ రంగంలో వినియోగించే ముడిసరకులైన బొగ్గు, లైమ్ స్టోన్, జిప్సమ్‌లపై విధించే డ్యూటీల్లో కూడా మార్పు లేదు. మౌలిక సౌకర్యాల కల్పనకు పెట్టే పెట్టుబడులు.. సిమెంట్ డిమాండ్‌పై ధనాత్మక ప్రభావాన్ని చూపించగలవు.

## నిర్మాణ రంగం:

బడ్జెట్‌లో రోడ్లు, రైల్వేలు, నీటిపారుదల, పట్టణ మౌలిక సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వడం నిర్మాణ రంగంపై ధనాత్మక ప్రభావాన్ని చూపించగలదు. పబ్లిక్-ప్రైవేట్ రంగంలో చేపట్టే ప్రాజెక్టులకు పరపతి మెరుగుపడటం వల్ల.. నిర్మాణ రంగంలో అనేక కొత్త కంపెనీలు ప్రవేశించే అవకాశం ఏర్పడింది. మౌలిక సౌకర్యాల రంగంలో నిర్మాణ వ్యయ వృద్ధి 2009-10లో 18 శాతం వరకు ఉండగలదని క్రిసిల్ అంచనా.

## ఎరువులు:

2008-09 బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీకి రూ.759 బిలియన్‌లు కేటాయించగా 2009-10 బడ్జెట్‌లో దీన్ని రూ.502 బిలియన్‌లకు తగ్గించారు. 2009-10 బడ్జెట్‌లో ఇతర బకాయిలతో కలుపు కొని మొత్తం ఎరువుల సబ్సిడీ రూ. 600 నుంచి 650 బిలియన్‌లకు చేరగలదని అంచనా.

## హోటళ్లు:

హోటల్ సౌకర్యాల వినియోగంలో ఉండే ఫ్రింజ్ బెనిఫిట్ ట్యాక్స్ రద్దు చేసినప్పటికి 2009-10 బడ్జెట్ ఈ రంగం వృద్ధిపై అంతగా ప్రభావం చూపకపోవచ్చు. కానీ ఆర్థిక మాంద్యం వల్ల వ్యాపార కార్యకలాపాలు

తగ్గడంతో ఈ రంగం ఆశించిన వృద్ధిని సాధించ లేకపోవచ్చు.

## హౌసింగ్:

పట్టణ పేదలకు మౌలిక సౌకర్యాల కల్పన కోసం జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ రెన్యువల్ మిషన్‌కు రూ. 39.7 బిలియన్లు కేటాయించారు. ఈ చర్య ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, తక్కువ ఆదాయ కేటగిరీలకు చెందిన ప్రజలకు గృహ వసతి కల్పించడానికి దోహదపడగలదు. జాతీయ గృహ నిర్మాణ బోర్డు కింద ఇందిరా ఆవాస్ యోజన పథకానికి రూ. 88 బిలియన్లు, గ్రామీణ హౌసింగ్ నిధికి రూ. 20 బిలియన్లు కేటాయించారు.

## పంచదార:

డిసెంబర్ 2009 వరకు పంచదార ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై నిషేధం 'వస్తు లావాదేవీలపై పన్ను' రద్దు చేయడం పంచదారరంగ అభివృద్ధికి ఏ విధంగాను తోడ్పడదు.

## టెక్స్‌టైల్స్:

ఎగుమతిదార్లకిచ్చే పరపతిపై వడ్డీ 1 శాతం తగ్గించారు. ఫైబర్ స్టేజ్ తర్వాత కాటన్ టెక్స్‌టైల్స్‌పై ఎక్సైజ్ డ్యూటీ పూర్తిగా తొలగించారు. మానవ తయారీ ఫైబర్, నూలుపై ఎక్సైజ్ డ్యూటీ 8 శాతానికి పెంచడం వల్ల పాలిస్టర్ ధరలు కిలోకు రూ. 2.50పైగా పెరిగాయి.

## రోడ్లు:

ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనకు 2009-10 బడ్జెట్‌లో రూ.120 బిలియన్లు కేటాయించారు. 2008-09తో పోల్చినపుడు 59 శాతం పెరిగింది. నేషనల్ హైవే డెవలప్‌మెంట్‌కు 23 శాతం మేర వనరులను పెంచారు. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంలో చేపట్టే ప్రాజెక్టులకు వాణిజ్య బ్యాంకులిచ్చే పరపతికి రీఫైనాన్సింగ్ సౌకర్యం కల్పిస్తున్నందువల్ల.. ఈ రంగ అభివృద్ధికి వాణిజ్య బ్యాంకులు ఇచ్చే పరపతి పెరిగే అవకాశం ఉంది.

## నౌకాయానాలు (Ports):

కోస్టల్, ఇన్‌ల్యాండ్ వాటర్స్ మార్గంలో జాతీయ జల మార్గాల ద్వారా రవాణా చేసే వస్తువులపై ప్రభుత్వం 'సర్వీసు పన్ను' విధించింది. తక్కువ వ్యయంలో కూడుకొన్న వస్తు రవాణాపై ఈ పన్ను విధింపు ప్రభావం పెద్దగా ఉండదు. కనీస ప్రత్యామ్నాయ పన్ను 10 నుంచి 15 శాతానికి పెరగడం ఈరంగంలో ఆదాయంపై ప్రభావం చూపుతుంది. భారత మౌలిక సౌకర్యాల కంపెనీ ద్వారా లభించే రీఫైనాన్సింగ్ కూడా ఈ రంగంపై అదనపు ప్రభావాన్ని చూపించకపోవచ్చు.

## గృహోపకరణాలు:

ఎల్‌సీడీ ప్యానెల్స్‌పై కస్టమ్స్ సుంకం 10నుంచి 5 శాతానికి తగ్గించడం ధనాత్మక ప్రభావాన్ని చూపించగలదు. స్క్రీన్ సైజ్‌ను బట్టి ఎల్‌సీడీ టీవీ ధరల్లో ఎల్‌సీడీ ప్యానెల్స్ ధర 45 నుంచి 70 శాతం వరకు ఉంటుంది. కస్టమ్స్ సుంకం తగ్గింపు ఈ రంగంలో డిమాండ్‌ను పెంచుతుంది. ఆదాయ పన్ను పరిమితి మిన హాయింపులో పెంపుదల కూడా ఇందుకు దోహదం చేస్తుంది.

## మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్

ప్రింట్ మీడియాలో ఏజెన్సీ కమిషన్ 15 శాతం తొలగింపు, ప్రకటనలపై 10 శాతం అదనపు పన్ను, న్యూస్ ప్రింట్‌ను కస్టమ్స్ సుంకం నుంచి మినహాయింపు లాంటి చర్యలు డిసెంబర్ 2009 వరకు కొనసాగుతాయి. ఆర్థిక వృద్ధి మందగించిన నేపథ్యంలో ఈ విధమైన చర్యలు ప్రింట్ ఇండస్ట్రీ అభివృద్ధికి దోహదపడ గలవు.

## నాన్-ఫెర్రస్ మెటల్స్:

నాన్-ఫెర్రస్ పరిశ్రమపై విధించే కస్టమ్స్, 'కేంద్ర విలువ ఆధారిత పన్ను'లో ఏ విధమైన మార్పు లేదు. తద్వారా నాన్‌ఫెర్రస్ మెటల్స్ ధరల్లో ఎటువంటి మార్పు ఉండదు. విద్యుత్ రంగం లో పెట్టుబడుల పెరుగడం వల్ల అల్యూమినియం డిమాండ్ పెరిగే అవకాశం ఉంది.

## పేపర్:

స్వదేశీ పేపర్ పరిశ్రమపై కస్టమ్స్, ఎక్సైజ్ డ్యూటీల్లో పెద్ద మార్పు లేనందువల్ల బడ్జెట్ ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చు. న్యూస్‌ప్రింట్‌కు ఆర్థిక ప్యాకేజీలో భాగంగా కస్టమ్స్ డ్యూటీ మిన హాయింపు కొనసాగుతుంది. విద్యా రంగానికి ఇస్తున్న ప్రాధాన్యత రాతపేపర్, ప్రింటింగ్ పేపర్ డిమాండ్ పెరుగుదలకు తోడ్ప డుతుంది. మొత్తం రాయిటింగ్, ప్రింటింగ్ పేపర్ డిమాండ్‌లో విద్యా రంగం వాటా 30 శాతం వరకు ఉంటుంది.

## ఫార్మా రంగం:

క్యాన్సర్, హెపటైటిస్, కీళ్ల నొప్పులు, కోసం వినియోగించే లైఫ్ సేవింగ్ డ్రగ్స్‌పై కస్టమ్స్ సుంకం 10నుంచి 5 శాతానికి తగ్గించ డంతో పాటు దిగుమతి చేసుకొనే కొన్ని డ్రగ్స్‌ను 'కేంద్ర విలువ ఆధారిత పన్ను' నుంచి మినహాయించడం వల్ల బడ్జెట్ ప్రభావం అంతగా ఉండదని భావించవచ్చు. కనీస ప్రత్యామ్నాయ పన్ను పెంపు ప్రభావం ఈ పరిశ్రమ రాబడిపై రుణాత్మకంగా ఉండగల దు.

## ఆయిల్ అండ్ గ్యాస్:

బడ్జెట్ ప్రభావం ఈ రంగంపై ధనాత్మకంగా ఉండగలదు. సెక్షన్ 801ఆ కింద సహజవాయు ఉత్పత్తికి 'పన్ను విరామం' పొడిగించారు. కనీస ప్రత్యామ్నాయ పన్ను క్రెడిట్ కాలాన్ని 7 నుంచి 10 ఏళ్ల పెంచినప్పటికి ఈ పన్ను పెరుగుదల వల్ల ప్రారం భంలో అధిక పన్ను outflow ఉండగలదు.

## ఉక్కు పరిశ్రమ

ఉక్కు పరిశ్రమ లాభదాయకతపై బడ్జెట్ ప్రభావం స్వల్పమే. స్టీల్ ఉత్పత్తులకు సంబంధించి కస్టమ్స్ లేదా కేంద్ర విలువ ఆధారిత పన్ను లో మార్పు లేదు. ఈ చర్య స్టీల్ ఉత్పత్తుల ధరల పై కూడా ఎటువంటి ప్రభావాన్ని చూపించకపోవచ్చు. మౌలిక సౌకర్యాల కల్పన కోసం పెట్టే అధిక పెట్టుబడుల వల్ల భవిష్యత్‌లో ఉక్కు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది.

- బడ్జెట్ ప్రభావం టెలికాం సర్వీస్ రంగంపై కొంత రుణాత్మకంగా ఉండగలదు. అదనపు కస్టమ్స్ పన్ను నుంచి విడి భాగాలు, సెల్‌ఫోన్లను ఏడాదిపాటు మినహాయించారు. ఫ్రింజ్ బెనిఫిట్ ట్యాక్స్ రద్దు చేసినప్పటికీ కనీస ప్రత్యామ్నాయ పన్ను 10 శాతం, బుక్‌ప్రాఫిట్స్‌పై 15 శాతం పన్ను విధించడం ఈ రంగంలోని కంపెనీల Cash Flows పై రుణాత్మక ప్రభావాన్ని చూపించగలదు.
- నాఫ్తాపై ఎక్సైజ్ డ్యూటీ 16 నుంచి 14 శాతానికి తగ్గించారు. డ్యూటీ తగ్గింపు ప్రభావం నాఫ్తా- ఆధారిత Crackers ఆదాయంపై ధనాత్మకంగా ఉండగలదు. ఎక్సైజ్, కస్టమ్స్ డ్యూటీల్లో ఎటువంటి మార్పు లేనందువల్ల స్వదేశీ పెట్రో కెమికల్ పరిశ్రమపై బడ్జెట్ ప్రభావం ఏ విధంగానూ ఉండకపోవచ్చు. కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 2006లో ప్రకటించిన అస్సాం గ్యాస్ క్రాకర్ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ. 54.61 బిలియన్‌లకు గాను ఈ బడ్జెట్‌లో మూలధన సబ్సిడీగా రూ. 21.38 బిలియన్‌లను కేటాయించారు.